బీజేపీ, కాంగ్రెస్‌లు ఒక్కటే

● కాంగ్రెస్ పాలన గాడి తప్పింది
● మాజీమంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి

పరిగి, మే 7(ఆంధ్రజ్యోతి): బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు రెండూ ఒక్కటేనని మాజీమంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి విమర్శించారు. మంగళవారం సాయంత్రం పరిగిలోని మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి నివాసంలో చేవెళ్ల బీఆర్‌ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్, శాసనమండలి మాజీ ఛైర్మన్ స్వామిగౌడ్, మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి, ఆ పార్టీ నేత గట్టు రాచందర్‌రావులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డికి బీజేపీ అభ్యర్థుల గెలుపుపై ఉన్న శ్రద్ధ వారి పార్టీ అభ్యర్థులపై లేదన్నారు. బీజేపీ ఐదు ఎంపీ సీట్లు గెలిపించేందుకు మాజీ సీఎం కేసీఆరే లోపాయికారి ఒప్పందం కుదుర్చుకున్నారని కాంగ్రెసోళ్లు చేస్తున్న ఆరోపణలను ఆమె ఖండించారు. బీజేపీ సీట్లు గెలువాలనే ఏకంగా ఆ పార్టీ సీఎంయే సహకరిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత హైదరాబాద్‌కు వచ్చిన ప్రధాని మోదీని కౌగిలించుకున్న రేవంత్‌రెడ్డి బడా బాయి (మోదీ), చోటాబాయి(రేవంత్‌రెడ్డి)లు ఇద్దరు ఒక్కటేననని విమర్శించారు. రేవంత్‌రెడ్డి బీజేపిలో చేరుతారని అందరూ అంటుంటే కనీసం స్పందించడం లేదంటే, పరోక్షంగా బీజేపీకి సహకరించినట్లే అని ప్రశ్నించారు. చేవెళ్లలో కొండాను గెలిపించాలని సీఎం సన్నిహితులే పరోక్షంగా సహకరిస్తున్నారని, ఈ విషయం రేవంత్‌రెడ్డికి తెలియకుండానే జరుగుతుందా..? అని ప్రశ్నించారు. రేవంత్‌పాలన ఐదు నెలల్లోనే గాడి తప్పిందని విమర్శించారు. పదేళ్లుగా రాష్ట్రాన్ని పటించుకోని బీజేపీ ప్రభుత్వానికి తెలంగాణలో ఓటు అడిగే హక్కు లేదనప్నారు. పాలమూరు-రంగారెడ్డి, కాళేశ్వరం ప్రాజెక్టులను జాతీయ హోదా కల్పించాలని వందలసార్లు బీఆర్‌ఎస్ ఎంపీలు పార్లమెంట్‌లో విననవించినా పట్టించుకోని బిజేపోళ్లు ఇప్పుడు ఎన్నికల కోసం పాలమూరుకు జాతీయహోదా కల్పిస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. జిల్లా వాసిగా, ఒక ఎంపిగా ఐదేళ్లలో రేవంత్‌రెడ్డి కూడా ఒక్కసారి పాలమూరు గురించి మాట్లాడలేదన్నారు. ప్రతి ఒక్కరి


పరిగిలో మాట్లాడుతున్న సబితారెడ్డి, పక్కన కాసాని జ్ఞానేశ్వర్

ఖాతాల్లో రూ.15 లక్షల జమ, బిజెపి ఇస్తామన్న రెండు కోట్ల ఉద్యోగులు ఎమయ్యాయని ప్రశ్నించారు. జిల్లాలు రద్దు చేస్తామంటున్నారు, వికారాబాద్ జిల్లాను ఉంచుతారా..? లేదా... అనేది స్పష్టత చేయాలని డిమాండ్ చేశారు. పదేళ్లలో కేసీఆర్ రాష్ట్రాన్ని దేశంలోనే మొదటిస్థానం నిలిపారని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపంచాలని కోరారు. శాసన మండలి మాజీ ఛైర్మన్ స్వామిగౌడ్ మాట్లాడుతూ,, కేసీఆర్ టికెట్లు ఇవ్వడంలో బీసిలకు పెద్దపీట వేశారని, చేవెళ్ల నుంచి పోటీ చేస్తున్న బీసీల ముద్దుబిడ్డ కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించాలని కోరారు. అన్ని రాజకీయ పార్టీలు బీసీలను చిన్నచూపు చూస్తున్నాయని విమర్శించారు. ఏ పార్టీలో ఉన్న కాసానికి ఓటేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. చేవెళ్ల బీఆర్‌ఎస్ ఎపీఎ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ, పదేళ్లలో కేసీఆర్ చేసిన అభివృద్ధి; అమలు చేసిన పథకాలను చూసి బీఆర్‌ఎస్‌కు ఓటేయ్యాలని కోరారు. ఐదు నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. కేసీఆర్ బస్సుయాత్రకు స్పందన చూస్తే ఇరత పార్టీలకు భయం పట్టుకుందన్నారు. ఈ సమావేశంలో పరిగి మాజీ ఎమ్మెల్యే కె.మహేశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ గట్టు రాంచందర్‌రావు, ఏఎంసీ మాజీ ఛైర్మన్ సురేందర్, నాయకులు బి.ప్రవీణ్‌రెడ్డి, ఎస్.భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.


మిత్రాహిల్స్‌లో ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు

● హైదర్‌నగర్‌లో ప్రచారం

హైదర్‌నగర్, మే 7 (ఆంధ్రజ్యోతి): హైదర్‌నగర్ డివిజన్ మిత్రాహిల్స్, ప్రశాంత్‌నగర్, ఏఎస్‌రాజునగర్‌లో చేవెళ్ల పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌కు మద్దతుగా పార్టీ నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు మాట్లాడుతూ మంచి చేసిన, రాష్ట్రాన్ని ఎంతో అభివృద్ధి చేసిన బీఆర్‌ఎస్‌కు ఓట్లు వేసి గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.

బీజేపీతోనే దేశం అభివృద్ధి

ఈటలకు మద్దతుగా ప్రచారం

కూకట్‌పల్లి, మే 7 (ఆంధ్రజ్యోతి): బీజేపీ గెలుపుతోనే దేశం మరింత భద్రత, అభివృద్ధి సాధించగలుగుతుందని కార్పొరేటర్ కొడిచెర్ల మహేందర్ అన్నారు. మూసాపేట డివిజన్‌లోని ఈడబ్ల్యూఎస్, మూసాపేట గూడ్స్‌షెడ్ రోడ్డు ప్రాంతాల్లో పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ప్రచారంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్రంలో బీజేపీకి 400 ఎంపీ సీట్లు రాబోతున్నాయని, అనుభవజ్ఞుడైన బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌ను గెలిపిస్తే మల్కాజిగిరి నియోజకవర్గ పరిధిలోని సమస్యలకు పరిష్కారం లభిస్తాయన్నారు. కార్యక్రమంలో విజయభవాని, మల్లేష్‌గౌడ్, శైలేష్, ఐలయ్య, జానకి, రాజేశ్వరి, శ్రీనివాస్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

● దేశం కోసం మోదీ ప్రధానిగా ఉండాల్సిందే..

దేశం సుభిక్షంగా, ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలంటే ప్రధానిగా నరేంద్రమోదీనే ఉండాలని మల్కాజిగిరి కార్పొరేటర్ ఉరపల్లి శ్రవణ్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మల్కాజిగిరి అభ్యర్థి ఈటల రాజేందర్‌కు మద్దతుగా మంగళవారం ఆర్‌కే నగర్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహి ంచారు. శివానంద్, హరీష్, శ్రీధర్, రాజు, రంగరాజన్, రాము, సంతోష్ పాల్గొన్నారు.

● ఈటలపై అసత్య ప్రచారాలను నమ్మొద్దు

మౌలాలి: ఈటల రాజేందర్‌పై ఏఐతో మార్ఫింగ్ చేసిన తప్పుడు వీడియోను మౌలాలి కార్పొరేటర్ సునీతయాదవ్, సీనియర్ నాయకుడు మోహన్‌యాదవ్ ఖండించారు. ఇలాంటి తప్పుడు ఆరోపణలను ఎవ్వరూ నమ్మొద్దని తెలిపారు. మల్కాజిగిరితో పాటు 13 చోట్ల బీజేపీ విజయం సాధిస్తుందని కార్పొరేటర్ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సాయిబాబు, నాయకులు లింగరావు, జగదీష్‌యాదవ్, భరత్‌యాదవ్, వెంకటేష్‌నేత, శివ పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారంలో కార్పొరేటర్ గున్నాల సునీతయాదవ్


మూసాపేటలో ప్రచారం చేస్తున్న బీజేపీ కార్పొరేటర్ మహేందర్, నాయకులు

● ఈటల కోసం కిషన్‌రెడ్డి సతీమణి ప్రచారం

రామంతాపూర్: పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం రామంతాపూర్ పాలిటెక్నిక్ కళాశాల, హబ్సిగూడ కాకతీయనగర్ పార్కులలో వాకర్స్‌ను ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే భేతి సుభాష్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి సతీమణి కావ్య, జిల్లా బీజే పీ ఉపాధ్యక్షుడు టి.హనుమంతరావు కలిసి ఈటల రాజేందర్‌కు మద్దతుగా ప్రచారం నిర్వహించారు.

● జాతీయ వాయిద్య కళాకారుల సంఘం మద్దతు

మల్కాజిగిరి: ఈటల రాజేందర్‌కు జాతీయ వాయిద్య కళాకారుల సంఘం మద్దతు ప్రకటించింది. ఈ మేరకు సంఘం జాతీయ అధ్యక్షుడు చెన్నారావు మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అంకితబావం కలిగిన ఈటల రాజేందర్‌కు తమ సంఘం తరపున పూర్తి మద్దతు ప్రకటిస్తున్నామని రాష్ట్ర బ్యాండ్ కళాకారుల సంఘం అధ్యక్షులు శ్రీనివాస్ హుస్సేన్ పాల్గొన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ శ్రవణ్

సీబీఐ అధికారులమంటూ రూ. 91.64 లక్షలు దోచేశారు

హైదరాబాద్ సిటీ, మే 7 (ఆంధ్రజ్యోతి): సీబీఐ అధికారులుగా పరిచయం చేసుకున్న సైబర్ నేరగాళ్లు 'మీ బ్యాంకు ఖాతాల నుంచి విదేశాలకు హవాలా డబ్బు వెళ్లింది' అని బెదిరించి నగరవాసి నుంచి రూ. 91.64 లక్షలు కాజేశారు. నగరానికి చెందిన 74ఏళ్ల వ్యక్తికి సైబర్ నేరగాళ్లు ఫోన్ చేసి, ఫెడెక్స్ కొరియర్ సర్వీస్‌లో మీ పేరున బ్యాంకాక్ నుంచి థాయ్‌లాండ్‌కు పంపిన పార్సిల్ అడ్రస్ సరిగాలేని కారణంగా తిరిగి వచ్చిందని చెప్పారు. అందులో పాస్‌పోర్టులు, బ్యాంకు పాస్‌పుస్తకాలు, 140 గ్రాముల ఎండీఎంఏతో పాటు, 4 కిలోల దుస్తులు ఉన్నాయని చెప్పారు. దీనిపై కేసు నమోదైందని చెప్పారు. కొద్దిసేపటి తర్వాత వీడియో కాల్ చేసిన సైబర్ నేరగాడు సీబీఐ అధికారిగా పరిచయం చేసుకున్నాడు. 'మీ ఆధార్‌కు అనుసంధానమైన ఖాతాల నుంచి విదేశాలకు 66.88 మిలియన్ల డాలర్ల హవాలా డబ్బు వెళ్లిందని, ఇందులో కొంత మొత్తం బ్యాంకాక్ పోలీసులు సీజ్ చేశారు. మీపై కేసు నమోదైందని, ఏక్షణంలోనైనా అరెస్టయ్యే అవకాశముంది' అని బెదిరించాడు. 'మీ ఖాతాల్లో ఉన్న డబ్బు ఏ మార్గాల్లో వచ్చిందో పరిశీలించి దానికి సంబంధించి సీబీఐ అధికారులు సర్టిఫికెట్ ఇస్తారు' అని చెప్పాడు. అందుకోసం 'మీ దగ్గర ఉన్న డబ్బును సీబీఐ ఖాతాకు బదిలీ చేయాలి' అని సూచించాడు. నమ్మకం కలిగించేందుకు సీబీఐ లెటర్‌హెడ్‌ను చూపించాడు. దాంతో తన ఖాతాలో ఉన్న రూ. 91.64 లక్షలు సైబర్ నేరగాడు సూచించిన ఖాతాలోకి పంపాడు. తర్వాత ఫోన్‌లు స్విచ్ఛాఫ్ రావడంతో మోసపోయానని గ్రహించి సైబర్‌క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

కూకట్‌పల్లిలో భారీ వర్షం

ఈదురుగాలులకు కూలిన చెట్లు

కూకట్‌పల్లి, మే 7 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లిలో మంగళవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి జనజీవనం స్తంభించింది. ఈదురుగాలులతో కూడిన వర్షం రావడంతో వాహనదారుల రాకపోకలపై తీవ్ర ప్రభావం చూపింది. వర్షం ప్రారంభం కాగానే.. విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. రాత్రి వరకు కరెంట్ రాకపోవడంతో ప్రజలు ఇబ్బందుకు గురయ్యారు. రోడ్లు జలమయ్యాయి. ఈదురుగాలుల ప్రభావానికి కేపీహెచ్‌బీకాలనీలోని ఐదవ రోడ్డులో ఓ చెట్టు నేలకొరిగింది. చెట్ల కొమ్మలు రోడ్డుపై పార్కింగ్ చేసిన ద్విచక్రవాహనాలపై పడింది. విరిగిన చెట్టు కొమ్మలు రోడ్డుకు అడ్డంగా పడిపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. అదేవిధంగా మూసాపేట, బాలాజీనగర్, కూకట్‌పల్లి, వివేకానందనగర్‌కాలనీ ప్రాంతాల్లోని వర్షం కారణంగా చెట్ల కొమ్మలు విరిగిపడడంతో విద్యుత్ నిలిచిపోయింది. ఒక్కసారిగా వాతావరణం చల్లబడటంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.


కేపీహెచ్‌బీకాలనీలో ద్విచక్రవాహనాలపై కూలిన చెట్టు

అల్లూరి ఒక మహోజ్వల శక్తి

హైదర్‌నగర్, మే 7(ఆంధ్రజ్యోతి): భారత స్వాతంత్ర్య ఉద్యమంలో అల్లూరి సీతారామరాజు ఒక మహోజ్వల శక్తి అని, ఆయన జరిపిన సాయుధ పోరాటం స్వాతంత్ర పోరాటంలో ఒక ప్రత్యేక అధ్యాయం అని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. అల్లూరి సీతారామరాజు వర్ధంతిని పురస్కరించుకుని ఉషాముళ్లపూడి కమాన్ వద్ద ఉన్న ఆయన విగ్రహానికి కార్పొరేటర్ నార్నె శ్రీనివాస్‌తో కలిసి ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ స్వతంత్ర్య సంగ్రామంలో బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా విరోచిత పోరాటం చేసిన మహనీయుడు అల్లూరి సీతారామరాజు అని కొనియాడారు. మన్యం ప్రజల్లో విప్లవ బీజాలు నాటి ప్రజలను చైతన్య పరిచి స్వతంత్ర్య సంగ్రామంలో పాల్గొనేలా చైతన్య పరిచిన మహానుభావుడన్నారు. సాంబశివరావు పాల్గొన్నారు.


క్రెచ్‌ను ప్రారంభిస్తున్న క్రెడాయ్ హైదరాబాద్ అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి

కార్మికుల పిల్లల కోసం 'క్రెచ్'

హైదరాబాద్ సిటీ, మే7 (ఆంధ్రజ్యోతి): వివిధ రాష్ట్రాల నుంచి వచ్చి నిర్మాణ రంగంలో పని చేస్తున్న కార్మికులకు క్రెడాయ్ హైదరాబాద్ ప్రత్యేక కార్యక్రమాలను చేపట్టింది. క్రెడాయ్ కేర్స్ కార్యక్రమంలో భాగంగా కార్మికుల పిల్లలకు పని ప్రదేశాల్లోనే ఆటవిడుపు కోసం క్రెచ్‌ను ఏర్పాటు చేశారు. కార్మికుల ఆరోగ్యాన్ని పరిరక్షించడానికి అనంత రిహాబ్‌తో కలిసి హెల్త్ చెకప్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా క్రెడాయ్ హైదరాబాద్ అధ్యక్షుడు వీ.రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ వ్యవసాయం తర్వాత అతిపెద్ద ఉపాధి కల్పన రంగంగా నిర్మాణరంగం ఉందని, దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో కార్మికులు నగరంలో పని చేస్తున్నారని తెలిపారు. కార్మికుల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నామని ఆయన వివరించారు. కార్యక్రమంలో ప్రెసిడెంట్ ఎలెక్ట్ ఎన్.జైదీప్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బీ.జగన్నాథరావులతో పాటు క్రెడాయ్ హైదరాబాద్ మేనేజింగ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించాలి

కుత్బుల్లాపూర్, మే 7 (ఆంధ్రజ్యోతి): పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించి ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సాధారణ పరిశీలకులు (జనరల్ అబ్జర్వర్) ప్రియాంక శుక్లా అధికారులకు సూచించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలైన గురుమూర్తినగర్, నిజాంపేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను ఆమె మంగళవారం పరిశీలించారు. అనంతరం సుచిత్రలోని లయోలా కళాశాలలోని డీఆర్‌ఎస్ (డిస్ట్రిబూషన్ అండ్ రిసెప్షన్ సెంటర్) కేంద్రంలోని స్ట్రాంగ్ రూంతో పాటు అన్ని ఏర్పాట్లను ఆమె పరిశీలించి ఏఆర్వో పులి సైదులును వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమాల్లో ఈఆర్వో వి.నర్సింహ, ఏఈఆర్వోలు ఉదయ్‌కుమార్, అబ్దుల్ రెహమాన్ ఖాన్, ఫూల్‌సింగ్, సూపరింటెండెంట్ గిరిబాబు, ఎన్నికల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


గురుమూర్తినగర్‌లోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సాధారణ పరిశీలకులు ప్రియాంక శుక్లా

లక్ష్మారెడ్డి గెలుపు కోసం కృషి చేయాలి

ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

కుత్బుల్లాపూర్ జోన్ బృందం, మే 7 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రతీ కాలని, బస్తీల్లో ఇంటింటికీ తిరుగుతూ మల్కాజిగిరి బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి విజయం కోసం ప్రచారం చేయాలని ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు పిలుపునిచ్చారు. పార్లమెంటు ఎన్నికల ప్రచారంలో భాగంగా కుత్బుల్లాపూర్, రంగారెడ్డినగర్, గాజులరామారం, సూరారం డివిజన్లలో, కొంపల్లి మున్సిపల్‌లో బీఆర్‌ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జాతీయ పార్టీల వల్ల తెలంగాణకు ఎటువంటి న్యాయం జరగదని, బీఆర్‌ఎస్‌తోనే పేదలకు లబ్ధి జరుగుతుందని తెలిపారు. ఈసారి పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు ఓటు వేసి రాగిడి లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. సమావేశాల్లో కార్పొరేటర్లు విజయ్‌శేఖర్‌గౌడ్, మంత్రి సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ కేఎం.గౌరీష్, నియోజకవర్గ బీఆర్‌ఎస్ యూత్ అధ్యక్షుడు సోమేష్‌యాదవ్, మున్సిపల్ అధ్యక్షుడు శ్రీశైలంయాదవ్, వైస్ ఛైర్మన్ గంగయ్యనాయక్, డి.శ్రీనివాస్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేకానంద్, పాల్గొన్న ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు


కూకట్‌పల్లిలో ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ సత్యనారాయణ

● కూకట్‌పల్లిలో ప్రచారం

కూకట్‌పల్లి: బీఆర్‌ఎస్ అభ్యర్థుల గెలుపుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని, పార్లమెంట్ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేయాలని కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ ఓటర్లను కోరారు. కూకట్‌పల్లి డివిజన్ పరిధిలోని ఎన్విరాన్ ఎన్‌క్లేవ్‌లో కార్పొరేటర్ ఆధ్వర్యంలో మంగళవారం ఇంటింటికీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్ కరపత్రాలను పంపిణీ చేస్తూ రాగిడి లక్ష్మారెడ్డిని మెజార్టీతో గెలిపించాలని కోరారు. బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు సంతోష్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గృహిణి మృతి

పేట్‌బషీరాబాద్, మే 7 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందింది. పేట్‌బషీరాబాద్ వివరాల ప్రకారం.. దుండిగల్ ప్రాంతంలోని బహదూర్‌పల్లి గ్రామానికి చెందిన యాదగిరి, సరస్వతి(38) దంపతులు గౌరవెల్లిలో తమ బంధువుల ఇంట్లో జరుగుతున్న ఎల్లమ్మ పండుగకు వెళ్తున్నారు. మార్గమధ్యలో రోడ్డుపై ఉన్న గుంతను తప్పించబోయి ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడిపోయింది. దీంతో ఇద్దరు కిందపడ్డారు. భార్య సరస్వతి తలకు బలమైన గాయాలయ్యాయి. స్థానికుల సాయంతో ఆసుపత్రికి తరలించగా అప్పటికే ఆమె మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. ఈ మేరకు పేట్‌బషీరాబాద్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


సరస్వతి(ఫైల్)

ప్రియురాలి ఆత్మహత్య.. అదృశ్యమైన ప్రియుడు

గాజులరామారం, మే 7 (ఆంధ్రజ్యోతి): ప్రేమించిన యువతి ఆత్మహత్య చేసుకోవడంతో ఆందోళన చెందిన ఓ యువకుడు అదృశ్యమయ్యాడు. ఈ సంఘటన సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బేగంపేట్ ఆదర్శనగర్‌కు చెందిన డి.సచిన్ సూరారంలోని ఓ ప్రైవేటు ఆఫీసులో కంప్యూటర్ ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. రోజు మాదిరిగానే సోమవారం ఇంటి నుంచి ఆఫీసుకు వెళ్లిన సచిత్ తిరిగి రాలేదు. దీంతో అతడి తండ్రి మనోహర్ సూరారం కాలనీలోని కార్యాలయం వద్దకు వెళ్లి తన కుమారుడి గురించి ఆరా తీశాడు. సచిన్ సహోద్యోగులు చెప్పిన వివరాల ప్రకారం కార్యాలయంలో ఓ యువతి, సచిన్ ప్రేమించుకున్నారు. ఈనెల 5వ తేదీన సచిన్ యువతి మధ్య పెళ్లి గురించి గొడవ పడ్డారు. తర్వాత ఇంటికి వెళ్లిన యువతి ఆత్మహత్య చేసుకుంది. ఆఫీసుకు వచ్చిన తర్వాత ఈ విషయం తెలియడంతో సచిన్ ఇంటికి వెళ్లలేదు. ప్రేమించిన యువతి చనిపోవడంతో భయపడిన సచిన్ అదృశ్యమయ్యాడని, అతడిని వెతికి పట్టుకోవాలని మనోహర్ సూరారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


సచిన్

ముగిసిన హోం ఓటింగ్

ఓటుహక్కు వినియోగించుకున్న 267 మంది ● 13 మంది దూరం

కుత్బుల్లాపూర్, మే 7 (ఆంధ్రజ్యోతి): 85 ఏళ్ల పైబడిన వృద్ధులు, దివ్యాంగ ఓటర్లకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించిన ఇంటి వద్దే ఓటు హక్కు వినియోగం (హోం ఓటింగ్) ప్రక్రియ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలో మంగళవారంతో ముగిసింది. నియోజకవర్గ పరిధిలో మొత్తం 280 మంది హోం ఓటింగ్ (ఫారం-12డి)కు దరఖాస్తు చేసుకోగా 259 మంది 4, 5వ తేదీల్లో ఓటు హక్కును వినియోగించుకున్నారు. మిగిలిన వారికి మంగళవారం మరోమారు అవకాశం కల్పించడంతో మరో 8 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. దీంతో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నుంచి 267 మంది హోం ఓటింగ్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నారు. మిగిలిన 13 మంది అందుబాటులో లేరని అధికారులు తెలిపారు. ఈ 13 మంది పార్లమెంటు ఎన్నికల్లో ఓటు హక్కును కోల్పోయినట్లే.. ఫారం-12డికి దరఖాస్తు చేసుకొని ఓటును వినియోగించుకోకుంటే అనంతరం ఏ విధంగాను ఓటు హక్కు వినియోగించుకొనే అవకాశం ఉండదు.


అయోధ్యనగర్‌లో హోంఓటింగ్ వేయిస్తున్న అధికారులు

నేటితో ముగియనున్న పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్

పార్లమెంటు ఎన్నికలకు పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ బుధవారంతో ముగియనుంది. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలో మొత్తం 1,823 మంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేయనుండగా వారిలో మంగళవారం నాటికి 1,204 మంది ఓటు వేశారు.

చేవెళ్ల అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తా..

చిలుకూరు ఎన్నికల ప్రచారంలో రంజిత్‌రెడ్డి

మొయినాబాద్ రూరల్, మే7(ఆంధ్రజ్యోతి): చేవెళ్ల పార్లమెంటు ప్రాంత అభివృద్ధికి కట్టుబడి పని చేస్తానని.. గతంలో ఎంపీగా పని చేసిన తాను ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. మంగళవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన చేవెళ్ల ఆసెంబ్లీ ఇన్‌చార్జ పామెన భీంభరత్ సమక్షంలో మండల పరిధిలోని చిలుకూరు గ్రామంలో ఇంటింటికీ తిరిగి కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా రంజిత్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో చేవెళ్ల ఎంపీగా పనిచేసిన తాను ఎంతో అభివృద్ధి చేశానని ఈ ప్రాంత అభివృద్ధి కోసమే కాంగ్రెస్ పార్టీలోకి చేరినట్లు తెలిపారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి ఉన్నందున చేవెళ్ల ఎంపీగా కాంగ్రెస్ ఎంపీగా తాను ఉంటే మరింత అభివృద్ధి సాధ్యమన్నారు. ప్రజలు తనను ఆశీర్వదించాలని కోరారు.

● చిలుకూరులో ప్రత్యేక పూజలు

చిలుకూరు బాలాజీ వేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో తన గెలుపు ఖాయమని చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రచారంలో బాగంగా మంగళవారం మండల పరిధిలోని చిలుకూరు బాలాజీ దేవాలయంలో వేంకటేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు దర్శన్, మండల పార్టీ అధ్యక్షుడు తమ్మలి మాణెయ్య, సర్పంచ్‌ల సంఘం మాజీ మం డలాధ్యక్షుడు కోట్ల నరోత్తంరెడ్డి, సీనియర్ నాయకులు కంజర బాస్కర్, మర్రి రవీందర్‌రెడ్డి, బాల క్రిష్టారెడ్డి దేవరంపల్లి మహేందర్‌రెడ్డి, తోలుకట్ట మాజీ సర్పంచ్ శ్రీనివాస్ మదిరాజ్, చిలుకూరు మాజీ సర్పంచ్ అంజన్న, మాజీ ఉప సర్పంచ్ అంజయ్య, పీఏసీఎస్ చైర్మన్ చంద్రారెడ్డి, సంగెరి మల్లేష్, మోత్కుపల్లి భాస్కర్


పార్టీలో చేరిన వారితో కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్, రంజిత్‌రెడ్డి తనయుడు ఆర్యన్‌రెడ్డి

కాంగ్రెస్‌లో చేరిక

హైదర్‌నగర్: చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి రంజిత్‌రెడ్డి తనయుడు ఆర్యన్‌రెడ్డి సమక్షంలో తులసినగర్‌కు చెందిన పలువురు బీఆర్‌ఎస్ నాయకులు ఆల్విన్‌కాలనీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో మంగళవారం చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోపీచారి, దొడ్ల రామకృష్ణగౌడ్, అనిల్‌రెడ్డి, గిరిప్రసాద్‌రెడ్డి, నాగరాజ్‌గౌడ్, క్రాంతికుమార్, నాగేశ్వరరావు, రమేష్, రాజు, విక్రమ్, వెంకట్, సతీష్ ఉన్నారు.

ఉన్నారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్సీపీ మండల మాజీ అధ్యక్షుడు మందడి వెంకట్‌రెడ్డి, పెద్దమంగళారం మల్లారెడ్డి, బొక్క దాన్‌రెడ్డి, రాజులు రంజిత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు.

● ప్రచారం ముమ్మరం

మియాపూర్: ఎన్నికల గడువు దగ్గర పడుతుండటంతో కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి కుటుంబసభ్యులు ప్రచారం ముమ్మరం చేశారు. గతంలో బీఆర్‌ఎస్ జెండాతో గెలిచిన రంజిత్‌రెడ్డి ప్రస్తుతం పార్టీమారి కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో నిలిచారు. గత ఎన్నికల్లో రంజిత్‌రెడ్డి గెలుపు కోసం కృషి చేసిన నాయకులు, కార్యకర్తలు ఇప్పుడు ప్రత్యర్థి పార్టీ వారుగా మారడంతో రంజిత్‌రెడ్డి గతం కన్నా భిన్నమైన ప్రచారశైలిని అనుసరిస్తున్నారు. ఆయన గెలుపు కోసం రంజిత్‌రెడ్డి సతీమణి సీతారంజిత్‌రెడ్డి, కుమారుడు ఆర్యన్‌రెడ్డి, కూతురు పూజారెడ్డి, అల్లుడు రాజేష్‌రెడ్డి, కుటుంబసభ్యులు మంజుల , ప్రత్యూశలు మంగళవారం శేరిలింగంపల్లిలోని పలు గేటెడ్ కమ్యూనిటీ వాసులను కలిసి రంజిత్‌రెడ్డికి ఓటువేసి గెలిపించాలని కోరారు.


చిలుకూరులో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డి


గేటెడ్ కమ్యూనిటీలో ప్రచారం చేస్తున్న రంజిత్‌రెడ్డి కుటుంబసభ్యులు